సాక్షి

పార్వతీపురం మన్యం

బుధవారం । 30 । జూలై । 2025



అయ్యవార్లకు అందని జీతాలు

బదిలీ టీచర్లకు రెండు నెలలుగా జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఫౌండేషన్ స్కూల్స్‌కు హెచ్‌ఎంలుగా నియమించిన కూటమి ప్రభుత్వం జీతాలు ఇవ్వడం మరిచిందని వాపోతున్నారు.

-8లో



ఐవీఎఫ్ సెంటర్ల ఆకస్మిక తనిఖీ

విజయనగరం ఫోర్ట్: విజయనగరం పట్టణంలో ఉన్న ఐవీఎఫ్, సరోగసీ సెంటర్లను డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవ నరాణి మంగళవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. రికార్డులు, రిపోర్టులను పరిశీలించారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వెబ్‌సైట్‌లో వైద్య కళాశాల పోస్టుల తుది జాబితా

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్యకళాశాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల్లో వివిధ కేటగిరీలకు సంబంధించిన తుది మెరిట్ జాబితాను విజయనగరం.ఏపీ.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల తెలిపారు. ఈఎంటీ, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, కంప్యూటర్ ప్రోగ్రామర్, ఎలక్ట్రీషియన్ గ్రేడ్-2, ఆఫీస్ సబార్డినేటర్ పోస్టుల జాబితాను వెబ్‌సైట్‌లో పెట్టామన్నారు.

న్యూస్‌రీల్

కళాశాలల్లో ప్రవేశాలు పెంచాలి



ఇన్‌స్పైర్ మనక్ పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

పార్వతీపురం: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు కృషిచేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పాఠశాల విద్యపై అధికారులతో మంగళవారం సమీక్షించారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రవేశాలు తక్కువగా ఉన్నాయని, ప్రవేశాలకు ఇంకా సమయం ఉన్నందున విద్యార్థులు చేరేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గుమ్మలక్ష్మీపురం, సాలూరు, పార్వతీపురం, పాలకొండ, సీతంపేట ఎంఈఓలు ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం ఇన్‌స్పైర్ మనక్ అవార్డు నామినేషన్లు-2025 పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈఓ బి.రాజీకుమార్, ఏడీ రమాదేవి, ఏపీసీ తేజేశ్వరరావు, డీఈవీఓ నాగేశ్వరరావు, డీడీ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతే ప్రధానం



రోగుల వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

సీతంపేట: ఎపిడమిక్ సీజన్లో వ్యాధుల వ్యాప్తిపై అప్రమత్తంగా ఉండాలని, నివారణ చర్యలు చేపట్టాలని డీఎంహెచ్ఓ భాస్కరరావు వైద్యులకు సూచించారు. సీతంపేట మండలం దోనుబాయి పీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రిని గురువారం సందర్శించారు. ఓపీ తీరుపై ఆరా తీశారు. మందుల నిల్వలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మలేరియా పాజిటివ్ కేసుల ఆధారంగా ఆయా గ్రామాల్లో ఐఆర్ఎస్ 5 శాతం ఏసీఎం ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. దోనుబాయిలో రెండో వైద్యుని పోస్టు భర్తీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ భాస్కరరావు, మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ జె.మోహన్‌రావు పాల్గొన్నారు.

జగనన్నను కలిసిన రాజన్నదొర



జగన్‌మోహన్‌రెడ్డితో మాజీ ఉపముఖ్యమంత్రి రాజన్నదొర

సాలూరు: వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర తాడేపల్లిలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ సమయంలో రాజన్నా ఎలా ఉన్నావు, మన్యం ఎలా ఉంది అంటూ జగన్‌మోహన్‌రెడ్డి ఆప్యాయంగా పలకరించినట్టు రాజన్నదొర ఫోన్‌లో స్థానిక విలేకరులకు తెలిపారు. తాడేపల్లిలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ సమావేశంలో రాజన్నదొర పాల్గొన్నారు. అనంతరం జగన్‌మోహన్‌రెడ్డితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని వివిధ అంశాలపై చర్చించారు. పార్టీ శ్రేణులకు అండగా ఉండాలని, మనకు మంచి రోజులు వస్తాయని జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పార్టీ శ్రేణులకు పెద్దపీట వేస్తామన్నారు. దీనిపై రాజన్నదొర స్పందిస్తూ కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమ పథకాలు అందక గిరిజన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మళ్లీ జగనన్న సంక్షేమ, అభివృద్ధి పాలనను ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు.

పొలంలోకి ఆర్టీసీ బస్సు

జియ్యమ్మవలస: జియ్యమ్మవలస మీదుగా వనజ వెళ్తున్న ఆర్టీసీ బస్సు మంగళవారం జియ్యమ్మవలస దాటిన తరువాత పొలాల్లోకి జారుకుంది. రహదారిపై జారుడు ఉండడంతో యూటర్న్ తీసుకునే క్రమంలో బస్సు పొలాల్లోకి వెళ్లినట్లు ప్రయాణికులు తెలిపారు. డ్రైవర్ చాకచక్యంతో బస్‌ను అదుపు చేయడంతో ప్రమాదం తప్పిందని ప్రయాణికులు చెప్పారు.



పొలంలోకి ఒరిగిపోయిన ఆర్టీసీ బస్సు

సంపన్నులను వదిలి.. చిరుద్యోగుల వెంట!

- ముందుకు రాని 'శ్రీమంతులు'
- అధికారులకు గుదిబండగా పీ-4
- దత్తత తీసుకోవాలని ఉద్యోగులపై ఒత్తిడి
- వేతన జీవులకు ఎలా సాధ్యమంటున్న ఉపాధ్యాయ సంఘాలు



సాక్షి, పార్వతీపురం మన్యం:

సంపద సృష్టిస్తామని, పేదరికాన్ని రూపుమాపుతామని ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. 'సామాజిక బాధ్యత' అంటూ సంపన్నుల వెంటపడుతున్నారు. బంగారు కుటుంబాలను తీర్చిదిద్దాలని.. ఆ మేరకు పేద వర్గాలను దత్తత తీసుకోవాలని ప్రాధేయపడుతున్నారు. ఆ పిలుపునకు సంపన్న వర్గాలెవరూ ముందుకు రావడం లేదు. స్వయంగా ఆ పార్టీ నాయకులే స్పందించడం లేదు. జిల్లాకు చెందిన మంత్రి సంధ్యారాణి.. అప్పుడెప్పుడో పది కుటుంబాలను దత్తత తీసుకుంటామని ప్రకటించారంతే! ఆ తర్వాత ఏ ప్రజాప్రతినిధి నుంచి గానీ.. ఉన్నతాధికారి నోటి వెంట గానీ దత్తత మాట రాలేదు. ప్రభుత్వం నుంచి నిర్దేశించిన ఆగస్టు గడువు సమీపిస్తుండటంతో కిందిస్థాయి ఉద్యోగులు, ఉపాధ్యాయులపై అంతా కలసి పడ్డారు. రెండేసి కుటుంబాలను దత్తత తీసుకోవాలని వెంటపడుతున్నారు. దీనిపై ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల జీతంపై ఆధారపడే ఉపాధ్యాయులపై రెండు కుటుంబాల దత్తత భారం మోపడం భావ్యమా? అని ఇప్పటికే ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. వాస్తవానికి సమాజంలో అట్టడుగున ఉన్న కుటుంబాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. అటువంటి ప్రభుత్వమే సమాజంలో సంపన్నులను గుర్తించి వారికి నిరుపేదలను దత్తత ఇవ్వాలని చూడటంపై విస్మయం వ్యక్తమవుతోంది.

మార్గదర్శకులు ఏరీ..?

పేదలను ఉన్నత స్థాయికి తీసుకువస్తామని ప్రచారం చేసుకుంటున్న రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం (పబ్లిక్-ప్రైవేట్-పీపుల్ పార్టనర్‌షిప్) పీ-4 అమలుకు కిందా మీద పడుతోంది. ఉగాది సందర్భంగా ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. పీ-4 ప్రారంభంలో పెద్ద ఎత్తున బంగారు కుటుంబాలను ఎంపిక చేశారు. ఇప్పుడు ఆ కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శకులు ముందుకు రావడం లేదు. ఆగస్టు 15 నాటికి నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలని ప్రభుత్వం ఒత్తిడి చేస్తోంది. ఆ మేరకు జిల్లా ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో అధికారుల మీద పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా మార్గదర్శుల కోసం అన్వేషణ చేస్తున్నా.. ఏ ఒక్కరూ ముందుకు రావడం లేదు. క్షేత్ర స్థాయిలో పరిస్థితితో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. పీ-4 విధానం.. ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కు అన్నట్టుగా సాగుతోంది. జిల్లాలో అధికార యంత్రాంగం అంతా సంపన్నుల అన్వేషణలో తలమునకలై ఉంది. ప్రభుత్వం నిర్దేశించిన గడువు ఆగస్టు-15 దగ్గరపడుతోంది. ఈ నేపథ్యంలో మిగిలిన పనులన్నింటినీ పక్కనబెట్టి అధికారులు సంపన్నుల కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాలో 33,309 కుటుంబాలను దత్తత తీసుకోవాల్సి ఉండగా.. ఇప్పటికి సుమారుగా 13 వేల కుటుంబాలే మ్యాపింగ్ అయ్యాయి. ఇంకా 20 వేల కుటుంబాల వరకు మార్గదర్శులను అనుసంధానం చేయాల్సి ఉంది. మార్గదర్శకులు ముందుకు రాకపోవడంతో పీ-4 ప్రారంభంలో పెద్ద సంఖ్యలో ఎంపిక చేసిన బంగారు కుటుంబాల సంఖ్య తగ్గించే పనిలో పడ్డారు.



పీ-4లో ప్రతి టీచర్ పేద కుటుంబాలను దత్తత తీసుకోవాలని ఇచ్చిన ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని విజయనగరం డీఈఓ మాణిక్యంనాయుడుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా కమిటీ సభ్యులు (ఫైల్)

అధికారులు, ఉద్యోగుల మెడపై కత్తి..

బంగారు కుటుంబాల తగ్గింపు, మార్గదర్శకుల గుర్తింపు ప్రక్రియ మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు గుదిబండగా మారింది. మండల స్థాయిలో ఒక్కో అధికారి నలుగురికి తక్కువ కాకుండా మార్గదర్శకులను గుర్తించాలని ఉన్నత స్థాయి నుంచి అధికారులపై ఒత్తిళ్లు ఉన్నాయి. పారిశ్రామిక సంస్థలు, వైద్యులు, విభిన్న రంగాలకు చెందిన సంపన్నులను గుర్తించి పీ-4 అమలులో మార్గదర్శకులుగా వారిని భాగస్వాముల్ని చేయాల్సిన బాధ్యతను అప్పగించడం అధికారులకు గుదిబండగా మారింది. మొదట్లో ఎడాపెడా కుటుంబాలను ఎంపిక చేయించిన ప్రభుత్వం ఇప్పుడు మార్గదర్శకాల పేరుతో కుటుంబాల సంఖ్యను తగ్గించే పని అప్పగించింది. సొంతిల్లు, విద్యుత్ కనెక్షన్, కుళాయి కనెక్షన్ .. ఇవేవీ లేని అత్యంత నిరుపేదలను ఎంపిక చేయాలని పై నుంచి వచ్చిన ఆదేశాలతో మండల స్థాయిలో అధికారులు తల పట్టుకుంటున్నారు. ప్రజల కనీస అవసరాలు తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది. కానీ సంపన్నులకు ఆ బాధ్యతను అప్పగించడమంటే ప్రభుత్వం పేదల సంక్షేమం నుంచి వైదొలగడమేనని మేధావి వర్గం అభిప్రాయపడుతోంది. మరోవైపు తమ పాఠశాలల్లో పని చేస్తున్న కింది స్థాయి సిబ్బందితో పాటు, విద్యార్థుల కుటుంబాలను దత్తత తీసుకోవాలని ఉపాధ్యాయులకు ప్రభుత్వం స్పష్టం చేసింది. కొన్ని విభాగాల్లో ఉద్యోగుల నెత్తినా రుద్దుతున్నారు. దీంతో ఆయా వర్గాల నుంచి నిరసన వ్యక్తమవుతోంది.

కార్పొరేట్లను వదిలి టీచర్లపై ఒత్తిడా?



పీ-4 పథకం ద్వారా పేదవర్గాలను ధనిక వర్గాలు తీసుకోవాలి. ప్రభుత్వం కార్పొరేట్ వారిని విడిచిపెట్టి ఉపాధ్యాయులపై ఒత్తిడి తేవడం తగదు. ప్రస్తుతం ఉపాధ్యాయులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటువంటి టీచర్లనే ప్రభుత్వం దత్తత తీసుకుని ఆదుకోవాలి. పీ-4 పథకం దత్తత కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నాం.

– ఎస్.మురళీమోహన్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

బలవంతపు దాతృత్వమా?



దాతృత్వం బలవంతం కాదు.. హృదయం నుంచి రావాలి. ఉపాధ్యాయుల ఆర్థిక పరిస్థితిని గమనించకుండా, వారిపై సామాజిక ఒత్తిడి పెంచేలా చర్యలు చేపట్టడం న్యాయసమ్మతమైనది కాదు. ఉపాధ్యాయులు ప్రభుత్వానికి చెందిన వేతన జీవులు. గృహ నిర్మాణ రుణాలు, పిల్లల చదువులు, ఖర్చులు, కుటుంబ సభ్యుల అనారోగ్య బాధ్యతలు, వివాహాలు వంటివన్నీ ఆ జీతం నుంచే భరించాలి.

– నల్లా బాలకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్

ఒక ఉపాధ్యాయుడికి సాధ్యమయ్యేనా..



పీ-4 విధానం ద్వారా కొన్ని లక్షల కుటుంబాలను బంగారు కుటంబాలుగా మార్చాలని నిర్ణయించడం ముదావహం. పారిశ్రామిక వేత్తలు, రాజకీయ నాయకులు, పెద్ద అధికారులు, సంపన్న వర్గాలను ఇందులో భాగస్వామ్యం చేసి దత్తత తీసుకోవాలని చెబితే బాగుంటుంది. నెల జీతంపై ఆధారపడే ఉపాధ్యాయుడు ఏ విధంగా రెండు కుటుంబాలను దత్తత తీసుకోగలడు?

– అమరపు సూర్యనారాయణ, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

పాలకొండ టీడీపీలో వర్గపోరు

- చైర్మన్ ప్రమాణ స్వీకారాన్ని బహిష్కరించిన 8 మంది సభ్యులు
- టీడీపీ ఇన్‌చార్జికి అందని ఆహ్వానం



ప్రమాణ స్వీకారం చేస్తున్న సంధ్యారాణి, పక్కన ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ: పాలకొండ నియోజకవర్గంలోని కూటమి నాయకుల్లో ఉన్న విభేదాలు మరో మారు బయటపడ్డాయి. పాలకొండ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారంలో కూటమి నాయకుల్లో ఉన్న లుకలుకలు బహిర్గతమయ్యాయి. పాలకొండ ఏఎంసీకి 15 మంది సభ్యులతో కూడిన పాలకవర్గాన్ని కూటమి ప్రభుత్వం నామినేట్ చేసింది. ఇందులో చైర్మన్ పదవితో కలిసి ఏడుగురు సభ్యులు జనసేన నుంచి ఎంపిక చేయగా, వైస్ చైర్మన్‌తో కలిసి మరో 8 మంది సభ్యులను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి వర్గానికి కేటాయించారు. పదవులు కేటాయించిన సమయంలోనే అటు ఎమ్మెల్యే జయకృష్ణ వర్గం తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ పంచాయితీ పార్టీ పెద్దల వద్దకు వెళ్లగా కూటమి సర్దుబాట్లు ప్రకారం ఎంపిక చేశామని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం చైర్మన్‌గా నియమించిన బిడ్డిక సంధ్యారాణి ప్రమాణ స్వీకారం చేపట్టారు. ఆమెతో పాటు జనసేన పార్టీ నుంచి ఎంపికైన ఆరుగురు సభ్యులు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో ప్రయాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవికి ఆహ్వానం అందలేదు. దీంతో ఆమె వర్గానికి చెందిన వైస్ చైర్మన్‌తో పాటు 8 మంది సభ్యులు ప్రమాణ స్వీకారాన్ని బహిష్కరించారు. అధికారికంగా తమను ప్రమాణ స్వీకారానికి పిలవకపోవడంపై అధికారులను నిలదీశారు. ఇరు వర్గాల మధ్య ఇటీవల జరిగిన పలు సమావేశాల్లో గొడవలు తలెత్తడంతో పోలీసులు ముందుగానే బలగాలను మోహరించారు.

ఆందోళనకు దిగకముందే.. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- కూటమి ప్రభుత్వానికి ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు హెచ్చరిక
- వచ్చేనెల 23, 24 తేదీల్లో జరిగే రాష్ట్ర సభలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు

విజయనగరం అర్బన్: రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆందోళన దిశగా వెళ్లక ముందే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను పరిష్కరించాలని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు హెచ్చరించారు. జిల్లా పర్యటనలో భాగంగా స్థానిక రెవెన్యూ హోమ్‌లో మంగళవారం ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రాతిపదికన జరిగిన ఏపీజేఏసీ అమరావతి జిల్లా సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గానికి ఇచ్చిన ఒక్క హామీ కూడా కూటమి ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. డిమాండ్ల సాధనకు ఉద్యమాలు తప్పని పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలోని 16 లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికి వదిలేసిందని, మరో వైపు ఉద్యోగులు దాచుకున్న సొమ్ములు ఎక్కడ ఉన్నాయో తెలియడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. బకాయిల చెల్లింపులపై కనీసం ఏ స్థాయిలోనూ చర్చలు జరపడం లేదని ఆరోపించారు. దాచుకున్న బకాయి సొమ్ము ఎంతెంత ఉందో ఆయా ఉద్యోగి, ఉపాధ్యాయునికి వివరంగా తెలియజేసే విధానాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఇటీవల అన్ని ఉమ్మడి జిల్లాలో పర్యటించామని, క్షేత్రస్థాయి సమస్యలను తెలుసుకున్నామని, వచ్చేనెల 23, 24వ తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి సభలో సమీక్షించి డిమాండ్‌ల అజెండాను తయారుచేస్తామన్నారు. అనంతరం జిల్లాలోని తహసీల్దార్లు, రెవెన్యూ కార్యవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ డాక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ అమరావతి వైస్ చైర్మన్ డాక్టర్ డి.జైధీర్, ఏపీ విభిన్న ప్రతిభావంతుల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.శ్రీనివాసరావు, ఏపీ స్టేట్ లేబర్ శాఖ ఎన్‌జీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.ప్రభాకర్, ఏపీ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి సిద్ధార్థ, ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిశెట్టి రాజేష్, జిల్లా అధ్యక్షుడు తాడ్డి గోవింద, ప్రధాన కార్యదర్శి సూర్య, ఏపీజేఏసీ జిల్లా కమిటీకి చెందిన వివిధ శాఖల ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, తహసీల్దార్లు, డివిజన్, జిల్లా కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు.

క్లుప్తంగా

పాముకాటుతో విద్యార్థికి అస్వస్థత

సాలూరు రూరల్: మండలంలోని తోణాం ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి కాగ్రాసునీల్ పాముకాటుతో అస్వస్థతకు గురయ్యాడు. పాఠశాల సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం సంపంగిపాడు పంచాయతీ గాలిపాడు గ్రామానికి చెందిన సునీల్ తోణాం ఆశ్రమ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ప్రతిరోజూ ఉదయం బహిర్భూమికి వెళ్లే అలవాటు ప్రకారం మంగళవారం బయటకు వెళ్లే సమయంలో పాముకాటుకు గురయ్యాడు. దీనితో వెంటనే పాఠశాల వార్డెన్ లచ్చయ్య తోణాం ఆస్పత్రికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం సాలూరు ఏరియా ఆస్పత్రికి అక్కడినుంచి విజయనగరంలోని ఘోషా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం విద్యార్థి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. వార్డెన్ లచ్చయ్య విద్యార్థిని దగ్గరుండి చూసుకుంటున్నారు.

పీఎంశ్రీ పథకంలో బొబ్బిలి గురుకులం ఫస్ట్



పీఎం శ్రీ పథకం కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, విద్యార్థులు

బొబ్బిలి: పీఎంశ్రీ పథకంలో బొబ్బిలి గురుకుల పాఠశాల జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచినట్టు ప్రిన్సిపాల్ రఘునాథరావు తెలిపారు. పట్టణంలోని సింహాల తోటలో ఉన్న ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలను పీఎంశ్రీ పథకంలో భాగంగా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వర్చువల్ విధానంలో మంగళవారం జాతికి అంకితం చేశారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏపీడీ ఎ.రామారావు, ఎంఈఓలు చల్ల లక్ష్మణరావు, గొట్టాపు వాసు, గురుకుల సిబ్బంది, ఎంపిక చేసిన విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశ్రమల దరఖాస్తులు గడువులోగా పరిష్కరించాలి

- జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

విజయనగరం అర్బన్: జిల్లాలో పరిశ్రమల స్థాపన కోసం అందిన దరఖాస్తులను సింగల్ డెస్క్ పాలసీ కింద 21 రోజుల్లో పరిష్కరించాలని సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. మే నుంచి జూలై వరకు 1652 దరఖాస్తులు అందగా 1634 దరఖాస్తులకు అనుమతి ఇచ్చామని, మిగిలిన వాటిలో 11 దరఖాస్తులు కాలుష్య నియంత్రణ మండలి వద్ద, మిగిలినవి ఫైర్, గ్రౌండ్ వాటర్, ఫ్యాక్టరీస్, లీగల్ మెట్రాలజి శాఖల వద్ద పెండింగ్ ఉన్నాయన్నారు. వాటిని గడువు లోగా పరిష్కరించాలని, తిరస్కరిస్తే తగిన కారణాలతో తిరస్కరించాలని సూచించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమల కమిటీ సమావేశం జేసీ ఆధ్వర్యంలో జరిగింది. సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ కరుణాకర్, నాబార్డ్ డీడీఎం నాగార్జున, ఎల్‌డీఎం రమణమూర్తి, విద్యుత్ శాఖ ఎస్ఈ లక్ష్మణ రావు, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సరిత, జిల్లా ఫైర్ ఆఫీసర్ రామ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జున రావు, ఫ్యాక్టరీస్, స్కిల్ డెవలప్‌మెంట్, శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎం గొడౌన్ల తనిఖీ

నెల్లిమర్ల: నెలిల్లమర్లలో ఉన్న ఈవీఎం గోదాములను కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మంగళవారం తనిఖీ చేశారు. గోదాము షట్టర్లకు, లోపలి గదులకు వేసిన సీళ్లను, తాళాలను పరిశీలించారు. బందోబస్తుపై సమీక్షించారు. సీసీ కెమెరాల ద్వారా చుట్టుపక్కల, గొదాముల్లోని పరిస్థితులను పరిశీలించారు. అప్రమత్తంగా ఉండాలని అధికారులను, పోలీసు సిబ్బందిని ఆదేశించారు. డీఆర్ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్‌డీఓ డి.కీర్తి, నెల్లిమర్ల తహసీల్దార్ శ్రీకాంత్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ భాస్కరరావు, ఇతర రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యవార్లకు అందని జీతాలు

- వచ్చే నెల కూడా అందవంటున్న ఉపాధ్యాయులు
- జిల్లాలో మొత్తం పాఠశాలలు: 1,504
- పనిచేస్తున్న ఉపాధ్యాయులు: 5,640 మంది
- జీతాలు అందని ఉపాధ్యాయులు: 1,150 మంది

క్రింది ఫొటోలో ఉన్న వీరఘట్టం మండలం కిమ్మి యూపీ పాఠశాలను ఎత్తివేసి ఈ పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా కూటమి ప్రభుత్వం మార్చింది. ఇందులో కొత్తగా వచ్చిన హెచ్ఎంతో కలిపి నలుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఈ పాఠశాలలో ఇదివరకే పనిచేస్తున్న ముగ్గురు ఉపాధ్యాయులకు జూన్ నెల జీతాలు వచ్చాయి.కొత్తగా వచ్చిన హెచ్ఎంకు నేటి వరకు జీతం అందలేదు.





జీతాల కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

ఈ ఫొటోలో ఉన్నది వీరఘట్టం మండలం నడిమికెల్ల యూపీ పాఠశాల. దీన్ని అప్‌గ్రేడ్ చేసి ఉన్నత పాఠశాలగా మార్చారు. ఇక్కడ ప్రస్తుతం 12 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వారిలో నలుగురు ఉపాధ్యాయులకు ఇంత వరకు జీతాలు అందలేదు. ఇలా జిల్లా వ్యాప్తంగా కొత్తగా ఏర్పడిన 1048 పాఠశాలలకు బదిలీపై వచ్చిన 1,150 మంది ఉపాధ్యాయలకు జీతాలు అందక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వీరఘట్టం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు ఇస్తామని చెప్పిన కూటమి నేతలు చెప్పిన మాటలన్నీ ఒట్టి అబద్ధాలేనని తేలిపోయింది. 1వ తేదీ కాదుకదా రెండు నెలలవుతున్నా కొందరు ఉపాధ్యాయులకు జీతాలు అందకపోవడంపై కూటమి ప్రభుత్వం తీరుపై అయ్యవార్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యావ్యవస్థలో నూతన మార్పులు తెస్తామని పేదవారికి సర్కారు విద్యను దూరం చేసిన కూటమి ప్రభుత్వం అందులో పనిచేస్తున్న కొందరు ఉపాధ్యాయులకు జీతాలు కూడా ఇవ్వకపోవడంపై ప్రభుత్వం తీరుపై ఉపాధ్యాయ సంఘాలు భగ్గుమంటున్నాయి.

అంతా హంగామా..

రీ-స్ట్రక్చర్ పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న పలు ప్రాథమిక, యూపీ పాఠశాలలకు మంగళం పలికారు. వాటి స్థానంలో ఫౌండేషన్ స్కూల్స్, బేసిక్ స్కూల్స్, మోడల్ ప్రైమరీ స్కూల్స్, బేసిక్ ప్రైమరీ హైస్కూల్స్, మోడల్ హైస్కూల్స్ ను తీసుకువచ్చి కూటమి ప్రభుత్వం హంగామా చేసింది. వాటిలో మోడల్ ప్రైమరీ స్కూల్స్‌లో కొత్తగా హెచ్ఎం పోస్టులను సృష్టించి స్కూల్ అసిస్టెంట్లను హెచ్ఎంలుగా నియమించింది. ఇలా బదిలీ అయినవారితో పాటు ఇటీవల జరిగిన సాధారణ బదిల్లో వచ్చిన వారెవరికీ జూన్ నెల జీతాలు వేయలేదు.జూలై నెల జీతాల బిల్లులు కూడా పెట్టలేదు.దీంతో జూలైలో రెండు నెలల జీతాలు అందుతాయనుకున్న బదిలీ ఉపాధ్యాయలకు నిరాశే మిగిలింది. కొత్తగా ఏర్పడిన పాఠశాలలకు పొజిషన్ ఐడీ లు ఇచ్చి బదిలీ ఉపాధ్యాయులకు జీతాలు విడుదల చేయాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

ఇదీ పరిస్థితి..

పార్వతీపురం మన్యం జిల్లాలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే నెపంతో 151 యుపీ పాఠశాలలను ఎత్తివేశారు.1053 ప్రాథమిక పాఠశాలలను 827కు కుదించారు. వాటి స్థానంలో కొత్తగా 91 ఫౌండేషన్ స్కూల్స్, 602 బేసిక్ స్కూల్స్, 221 మోడల్ ప్రైమరీ స్కూల్స్, 35 యూపీ స్కూల్స్, 80 హైస్కూల్స్,10 బేసిక్ ప్రైమరీ హైస్కూల్స్, 9 మోడల్ హైస్కూల్స్ ను తీసుకువచ్చారు. వాటితో పాటు కేజీబీవీలు, గిరిజన ఆశ్రమ పాఠశాలలతో కలిపి జిల్లా వ్యాప్తంగా 1,504 సర్కారు బడులు ఉన్నాయి. వాటిలో 5,640 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వారిలో బదిలీలపై ఒక పాఠశాల నుంచి వేరే పాఠశాలకు వచ్చిన 1,150 మంది ఉపాధ్యాయులకు ఈ విద్యా సంవత్సరంలో నేటి వరకు జీతాలు అందకపోవడంతో కూటమి ప్రభుత్వం తీరుపై ఉపాధ్యాయులు గుర్రుగా ఉన్నారు.

ఆర్థిక అనుమతులు లేకపోవడమే కారణమా?

రీ-స్ట్రక్చర్ పేరుతో కొత్తగా ఏర్పాటు చేసిన పాఠశాలలకు ఆర్థిక అనుమతులు లేకపోవడంతోనే బదిలీ ఉపాధ్యాయులకు జీతాలు అందలేదని పలువురు అంటున్నారు. వాస్తవానికి కొత్తగా వచ్చిన విద్యా విధానంపై ముఖ్యమంత్రి సమక్షంలో మంత్రిమండలి సమావేశం నిర్వహించి ఆమోదం తెలపాలి. తర్వాత వాటికి ఆర్థిక అనుమతులు ఇవ్వాలి. అయితే ఇవేవీ పాటించకుండా కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యావిధానంలో కొందరు అయ్యవార్లకు జీతాలు అందక సతమతమవుతున్నారు.జూలై నెలకు సంబంధించిన జీతాల బిల్లులను ట్రెజరీకి పంపించే సమయం కూడా పూర్తి కావడంతో ఇక జూలై నెల జీతం కూడా అందదని నిర్ధారణ కావడంతో ప్రభుత్వం తీరుపై ఉపాధ్యాయులు భగ్గుమంటున్నారు.

చాలా దారుణం



బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు ఇంత వరకు జీతాలు ఇవ్వకపోవడం చాలా దారుణం. జీతాలు చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో దారుణ పరిస్థితి ఏర్పడింది. ఉపాధ్యాయులకు బోధనేతర పనులను అప్పగిస్తున్న ప్రభుత్వం వారికి సకాలంలో జీతాలు వేస్తామని ఆలోచించకపోవడం చాలా అన్యాయం . బదిలీపై కొత్తగా ఏర్పడిన పాఠశాలలకు వచ్చిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు వేయాలి.

మజ్జి పైడిరాజు,
యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి, వీరఘట్టం

పొజిషన్ ఐడీలు ఇవ్వాలి



ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ గడిచి రెండు నెలలు కావస్తున్నా జీతాలు వేయకపోవడం ఏంటి? కొత్తగా ఏర్పడిన పాఠశాలలకు పొజిషన్ ఐడీలు ఇచ్చి జీతాలు విడుదల చేయాలి. మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ కోసం 15 రోజుల పాటు ఉపాధ్యాయులకు కంటిమీద కునుకు లేకుండా చేశారు. యాప్‌లో పదే పదే ఫొటోలు అప్‌లోడ్ చేసినా చాలా వరకు తిరస్కరించారు.అయినా సరే విసుగు చెందకుండా పనులను సక్రమంగా పూర్తి చేశాం. అంతేకాక సంబంధం లేని పనులను కూడా చేయాల్సి వస్తోంది. ఇంత చేసినా సకాలంలో జీతాలు వేయకపోతే ఎలా? వెంటనే జీతాలు విడుదల చేయాలి.

బంకురు అప్పలనాయుడు,
పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి, వీరఘట్టం

అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి పక్కా గృహం

- ఎస్ఎస్ఎల్ఆర్ ఎ.డి గోవిందరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎస్ఎల్ఆర్ ఎ.డి. గోవిందరావు

పార్వతీపురం: జిల్లాలో అర్హత గల ప్రతి ఒక్క కుటుంబానికి రానున్న రెండేళ్లలో పక్కా గృహం ఉండేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సర్వే, భూ నమోదు విభాగం అదనపు సంచాలకుడు ఆర్. గోవిందరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు భూమిని ఇంటి నిర్మాణానికి కేటాయించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 2019 కన్నా ముందు అభ్యంతరాలు లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి రెగ్యులైజేషన్‌ను ఈ ఏడాది డిసెంబర్ లోగా పూర్తి చేయాలన్నారు. ఆక్రమణకు గురైన శ్మశాన వాటికల స్థలాలను గుర్తించి, ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమిని తిరిగి పొందేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని చెప్పారు. జిల్లాలో చేపడుతున్న రీ సర్వే-2 డిసెంబర్ 27 నాటికి పూర్తి కావాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జేసీ శోభిక రెవెన్యూ శాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాల వివరాలు, లక్ష్యాలు, ప్రగతి నివేదికను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ, సి. యశ్వంత్ కుమార్ రెడ్డి, డీఆర్ఓ కె.హేమలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పి.ధర్మచంద్రారెడ్డి, ఎస్.దిలీప్ చక్రవర్తి, తదితరులు ఉన్నారు. జిల్లాకు వచ్చిన ఎస్ఎస్ఎల్ఆర్ ఏడీ గోవిందరావు తొలుత జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

రెండిళ్లు దగ్ధం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని చెముడుగూడ గ్రామంలో అగ్నిప్రమాదం సంభవించి రెండిళ్లు దగ్ధమయ్యాయి. ఈ ఘటనపై గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం గ్రామానికి చెందిన బిడ్డిక కోటేశ్వరరావు ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్‌లీకై మంటలు చెలరేగాయని, కోటేశ్వరరావు ఇంటితో పాటు పక్కనే ఉన్న మండంగి శంకరరావు ఇట్లోకి కూడా మంటలు చెలరేగాయన్నారు. ఈ విషయం గమనించి గుమ్మలక్ష్మీపురం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా అగ్నిమాపక సిబ్బంది కూడా వచ్చి మంటలను పూర్తిస్థాయిలో అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష వరకు ఆస్తినష్టం జరిగి ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది అంచనా వేశారు.

మృతదేహం వివరాలు లభ్యం

లక్కవరపుకోట: మండలంలోని చందులూరు గ్రామం సమీపంలో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు సోమవారం గమనించిన విషయం తెలిసిందే. ఈ మేరకు పోలీసులు విచారణ చేపట్టి మృతుడిని మార్లాపల్లి గ్రామానికి చెందిన లెక్కల ఈశ్వరరావు(51)గా గుర్తించారు. మృతుడు వేసుకున్న బట్టలను, మృతదేహాన్ని బంధువులు చూసి గుర్తుపట్టినట్లు ఎస్సై నవీన్‌పడాల్ తెలిపారు. ఈశ్వర రావుకు విపరీతంగా తాగుడు అలవాటు ఉంది. ఈ క్రమంలో శనివారం రాత్రి పూటుగా మద్యం తాగి ఇంటి నుంచి వెళ్లేపోయాడు. ఎప్పటి మాదిరిగా తిరిగి వస్తాడనుకోగా ఎంతకీ రాలేదు. చందులూరు వైపు వెళ్లి రోడ్డు పక్కన తుప్పల్లో పడిపోవడంతో సాయం చేసిన వారు లేక మృతి చెంది ఉంటాడని కుటుంబసభ్యులు అభిప్రాయం వ్యక్తం చేశారు. మృతుడికి భార్య వరం, కూతురు, కొడుకు ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దివ్యాంగులు అన్ని రంగాల్లో ప్రతిభ కనబరచాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



దివ్యాంగులకు ఉపకరణాలను అందజేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తదితరులు

పార్వతీపురం టౌన్: దివ్యాంగులు అన్ని రంగాల్లో తమ ప్రతిభను కనబరిచేందుకు పర్పుల్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. కాంపోజిట్ రీజనల్ సెంటర్ ఫర్ స్కిల్ డెవలప్‌మెంట్, రీహ్యాబిలిటేషన్ అండ్ ఎంపవర్‌మెంట్(సీఆర్‌సీ), నెల్లూరు, జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో పర్పుల్ ఫెయిర్ కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, పార్వతీపురం ఎమ్మెల్యే బి.విజయచంద్రలు దివ్యాంగులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి వారిలో ఉండే ప్రతిభను గుర్తించి అభినందించారు. విభిన్న ప్రతిభా వంతుల్లో కూడా అసమాన్య ప్రతిభ ఉంటుందని, దాన్ని గుర్తించి ప్రోత్సహిస్తే సామాన్యుల కంటే తీసుపోరని కితాబిచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పర్పుల్ ఫెయిర్ కార్యక్రమాన్ని రాష్ట్రంలో తొలిసారిగా పార్వతీపురం మన్యం జిల్లాలో నిర్వహించడం ఎంతో గర్వకారణమన్నారు. బ్రెయిన్ హెల్త్ ఆటిజం మొదలైన బాధితులకు చికిత్స ఇచ్చేందుకు నీతి ఆయోగ్‌తో పార్వతీపురంలో ఒక కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. భవిత కేంద్రాల్లో దివ్యాంగులకు అవసరమైన విద్య, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల కురుపాం మండల కేంద్రానికి చెందిన విద్యార్థి తనలోని లోపాలను చూసి వెనుకడుగు వేయకుండా ఆత్మవిశ్వాసంతో గ్రాండ్ ట్రిక్స్‌లో 1500మీటర్లు, 400మీటర్ల పరుగు పందెంలో ఒక గోల్డ్, ఒక బ్రాంజ్ మెడల్ సాధించినట్లు తెలిపారు.

దివ్యాంగుల కలల సాకారం

ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ విభిన్న ప్రతిభా వంతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉంటాయన్నారు. ఎమ్మెల్యే విజయచంద్ర మాట్లాడుతూ దివ్యాంగుల కలలను సాకారం చేసుకునేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదం చేస్తుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఉపకరణాలను, స్టాల్స్ యాజమానులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సీఆర్‌సీ డైరెక్టర్ మనోజ్ కుమార్, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఎ.డి ఎల్ఎస్‌వీ శ్రీధర్, డీఈఓ బి.రాజ్‌కుమార్, డీవీఈఓ వై. నాగేశ్వరరావు, ఏపీసీ ఆర్.తేజేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ సుధారాణి, ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

150 కిలోల గంజాయి పట్టివేత

శృంగవరపుకోట: మండలంలో బొడ్డవర వద్ద వాహన తనిఖీలు చేస్తున్న ఎస్.కోట పోలీసులకు సుమారు 150కిలోల గంజాయి పట్టుబడినట్టు సమాచారం. సోమవారం రాత్రి అరకు నుంచి వస్తున్న కేరళ రిజిస్ట్రేషన్‌తో ఉన్న బొలెరో వాహనంలో గంజాయిని పోలీసులు గుర్తించారు. ఈ సందర్భంగా వాహనాన్ని, వాహనంలో ఉన్న సుమారు 150కిలోల గంజాయిని వ్యక్తుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తుల నుంచి మరింత సమాచారం సేకరించే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఇదే విషయమై ఎస్.కోట సీఐ వేచలపు నారాయణమూర్తి వివరణ కోరగా, పూర్తి వివరాలు తెలిపేందుకు బుధవారం మీడియా సమావేశం నిర్వహిస్తామని చెప్పారు.

హోంగార్డ్స్ సంక్షేమానికి చర్యలు

- ఎస్పీని కలిసిన విశాఖ రేంజ్ కమాండెంట్ జోషి



ఎస్పీ వకుల్ జిందల్‌ను కలిసి మొక్క ఇస్తున్న విశాఖ రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ జోషి

విజయనగరం క్రైమ్: విశాఖ రీజియన్ హెూంగార్డ్స్ కమాండెంట్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎ.జోషి తొలిసారి జిల్లాకు వచ్చి, ఎస్పీ వకుల్ జిందల్‌ను మర్యాద పూర్వకంగా మంగళవారం కలిసి, పూల మొక్కను అందజేశారు. హెూంగార్డ్స్ సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలపై ఎస్పీ వకుల్ జిందల్ తో ఈ సందర్భంగా చర్చించారు. ఆపై వారి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు చేపడతానని చెప్పారు. అనంతరం ఆయన హోంగార్డులతో సమావేశమై, విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను హోంగార్డు కుటుంబాలకు వర్తింపజేయాలని, విధి నిర్వహణలో ఒక ప్రాంతం నుంచి వేరే ప్రాంతానికి ప్రయాణించేందుకు బస్ పాస్ వంటి సౌకర్యాలను కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని హోం గార్డులు కోరగా, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి, పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా హోంగార్డ్స్ నిర్వహించిన పరేడ్ ను కమాండెంట్ పరిశీలించారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రమేష్ కుమార్, ఆర్ఎస్సై ముబారక్ అలీ, హెూంగార్డ్స్ ఇన్చార్జ్ హెచ్‌సీలు రాజు, శ్రీనివాస రావు, హెూంగార్డులు పాల్గొన్నారు.

నవోదయలో హ్యాండ్‌బాల్ మీట్



జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలు ప్రారంభిస్తున్న నవోదయ ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్

శృంగవరపుకోట: మండలంలోని కిల్తంపాలెం పంచాయతీ పరిధిలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయలో హైదరాబాద్ రీజియన్ హ్యాండ్‌బాల్ మీట్ 2025-26ను ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ మంగళవారం అట్టహాసంగా ప్రారంభించారు. ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి, దక్షిణ భారత దేశంలో ఎనిమిది క్లస్టర్ల నుంచి వచ్చిన క్రీడాకారులు, ఆయా విద్యాలయాల కోచ్‌లను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యానాం, అదిలాబాద్, కన్నూర్, కరైకల్, ఎర్నాకుళం, హవేరి, హాసన్, కలబుర్గి క్లస్టర్ల నుంచి క్రీడాకారులు వచ్చినట్లు చెప్పారు. మూడు రోజుల పాటు జరిగే పోటీలకు ఏపీ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ ఎస్.రాజారావు నేతృత్వం వహిస్తారని చెప్పారు. కట్టా శ్రీను, ఎన్‌వీవీ కుమార్‌లు రిఫరీలుగా బాధ్యతలు నిర్వహిస్తారన్నారు. ఈపోటీల్లో విజేతలుగా నిలిచిన అథ్లెట్లు బీహార్ రాష్ట్రంలోని నలందలో జరిగే జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో హైదరాబాద్ రీజియన్‌కు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. క్రీడాకారుల కోసం చేసిన ఏర్పాట్లను వివరించారు.

ఫార్మా, హెల్త్‌కేర్ రంగాల్లో ఉచిత శిక్షణ




ఎంఓయూ కుదుర్చుకుంటున్న స్మృతిరంజన్, నాగేశ్వరరావు

శ్రీకాకుళం రూరల్: ఒడిశాకు చెందిన విద్యార్థులకు ఫార్మా, హెల్త్ కేర్ రంగాల్లో ఉచిత శిక్షణ, ఉద్యోగాలు కల్పించేందుకు శ్రీకాకుళం బొల్లినేని మెడ్‌స్కిల్స్‌తో మంగళవారం ఎంఓయూ కుదుర్చుకున్నామని గజపతి జిల్లా డీఎస్‌డీఈఓ సౌభాగ్య స్మృతిరంజన్ త్రిపాఠి తెలిపారు. ఎస్‌యూవీ ఒడిశా శిబిరంలో భాగంగా 240 మంది విద్యార్థులకు ప్రభుత్వ సహకారంతో శిక్షణ అందించనున్నామని పేర్కొన్నారు. ప్లస్ త్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులకు పేషెంట్ రిలేషన్ అసోసియేట్, ఎస్ఎస్‌సీ, ప్లస్ టూ, ప్లస్ త్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులకు అసోసియేట్ స్టోర్ ఫార్మా కోర్సులో శిక్షణ ఇస్తామని తెలిపారు. 18 నుంచి 35 ఏళ్ల విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. శిక్షణతో పాటు ఉచిత భోజన వసతి సదుపాయం, యూనిఫామ్ స్టడీ మెటీరియల్ అందిస్తామన్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 7331118019, 7680945357, 7995013422 నంబర్లను గానీ, శ్రీకాకుళం రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో గానీ సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు, గజపతి జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు పాల్గొన్నారు.

ఆటో, బైక్ ఢీ: వృద్ధుడి మృతి

- మరో నలుగురికి తీవ్రగాయాలు



రోడ్డుపక్కన పడి ఉన్న ప్రమాదానికి కారణమైన బైక్‌పై వెళ్తున్న యువకుడు

లక్కవరపుకోట: అరకు-విశాఖపట్నం జాతీయ రహదారిలో మంగళవారం కొత్తవలస నుంచి ప్రయాణికులతో ఆటో వస్తుండగా సోంపురం జంక్షన్ నుంచి మితిమీరిన వేగంతో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి రంగరాయపురం జంక్షన్ సమీపంలో ఎత్తుబ్రిడ్జి వద్ద ఆటోను బలంగా ఢీకొట్టాడు. దీంతో ఆటో అదుపు తప్పి బొల్తా కొట్టి రోడ్డుపై పడిపోయింది. ఆటోలో ప్రయాణిస్తున్న కిత్తన్నపేట గ్రామానికి చెందిన యడ్ల సింహాచలం(64) అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్ బంగారయ్యతో పాటు మరో ముగ్గురు వ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. బైక్ నడుపుతున్న వ్యక్తి పూర్తిగా మద్యం తాగి ఉన్నాడని ఎల్.కోట జంక్షన్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా వారిని చూసి సంబంధిత వ్యక్తి ఆగకుండా బండిపై వెళ్లి ప్రమాదానికి కారణమయ్యాడని స్థానికులు తెలిపారు. స్థానికుల సహాయంతో క్షతగాత్రులను 108 వాహనంలో ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ పాపారావు తెలిపారు.

ఆడపిల్లలకు స్వీయ రక్షణలో ప్రత్యేక శిక్షణ



సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్ శిక్షణను ప్రారంభించిన ఎస్పీ వకుల్, చిత్రంలో ఏఎస్పీ సౌమ్యలత, శిక్షకురాలు రాధ

విజయనగరం క్రైమ్: జిల్లాలో ఉన్న అన్ని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు స్వీయ రక్షణ మెలకువలు నేర్పించేందుకు ప్రత్యేకంగా ఒక మహిళా శిక్షకురాలిని నియమించినట్లు ఎస్పీ వకుల్ జిందల్ మంగళవారం తెలిపారు.ఈ మేరకు నగరంలోని కంటోన్మెంట్ శార్వాణి పోలీసు వెల్ఫేర్ ఆంగ్ల పాఠశాలలో నిర్వహించిన శిక్షణ శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థినులపై జరిగే దాడులు, ఈవ్‌టీజింగ్, ఆకతాయిల వేధింపులు, లైంగిక దాడులను ప్రతిఘటించి, వారి దాడులను తిప్పి కొట్టేందుకు శిక్షణ ఏర్పాట్లు కల్పిస్తున్నట్లు ఎస్పీ చెప్పారు.జిల్లా వ్యాప్తంగా ప్రతి పాఠశాల, కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు తమను తాము రక్షించుకునేందుకు కొన్ని స్వీయ రక్షణ టెక్నిక్స్ ను నేర్పాలని నిర్ణయించామన్నారు. ఇందులో భాగంగా ప్రత్యేకంగా రాధ అనే మహిళా శిక్షకురాలిని జిల్లా పోలీసుశాఖ నియమించిందని చెప్పారు. ఈ శిక్షకురాలు పాఠశాలల్లోని వ్యాయామ ఉపాధ్యాయులకు సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ ను ముందుగా నేర్పించి, వారి సహకారంతో అన్ని పాఠశాలల్లోని విద్యార్థినులకు వాటిని నేర్పించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ శిక్షణ కోసం ఉపాధ్యాయులు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్పీ సీఐ ఏవీ లీలారావు, ఆర్ఐ ఎన్.గోపాలనాయుడు, పాఠశాల హెచ్ఎం సంధ్య, ఆర్ఎస్సైలు ప్రసాదరావు, రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.